నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 15 అక్టోబర్ 2024 | KARIMNAGAR

## విదేశాల్లో ఉద్యోగావకాశాలు

17న ఇంటర్వ్యూలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 14 : విదేశాల్లో ఉద్యోగాల కోసం ఈ నెల 17న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ ద్వారా తెలంగాణ నుంచి అర్హత కలిగిన సెమీస్కిల్డ్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్ సులభం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా, దుబాయ్ (యూఏఈ)లో బైక్ రైడర్స్ (డెలివరీ బాయ్స్)కి ఉద్యోగావకశాలు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులై ఉండాలని, తప్పనిసరిగా పాస్‌పోర్ట్, మూడేళ్ల బైక్ డ్రైవింగ్ లైసెన్స్, 21-40 ఏండ్ల మధ్య ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జొమాటో, స్విగ్గీ, ఏదైనా ఫుడ్ డెలివరీలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 17న గురువారం ఉదయం 9 గంటలకు నగరంలోని శ్వేత హోటల్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. వివరాకలు 94400 51285, 94400 48500, 97010 40062, 94400 51452 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

## అటవీశాఖ ఉద్యోగులపై వేటు

కార్యాలయంలో మందు విందు ఎఫెక్ట్
ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్
మరో ఇద్దరు తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు

జగిత్యాల, అక్టోబర్ 14, (నమస్తే తెలంగాణ) : జగిత్యాల అటవీశాఖ కార్యాలయంలో మందు విందులో పాల్గొన్న అధికారులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ కాగా, మరో ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఈ నెల 11న జగిత్యాల జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు మందు విందు చేసుకోవడం, మీడియా అక్కడికి వెళ్లడంతో వారు అక్కడి నుంచి పలాయనం చిత్తగించిన విషయం తెలిసిందే. ఇదంతా బయటకు పొక్కడంతో సంబంధిత అధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టారు. ఆ తర్వాత ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ బాసర జోన్ సీసీఎఫ్ శరవణన్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డిప్యూటీ రేంజర్ అరుణ్ కుమార్‌తోపాటు కొడిమ్యాల బీట్ ఆఫీసర్ సాయిరామ్‌ను సస్పెండ్ చేస్తూ మెమో జారీ చేశారు. అలాగే, జగిత్యాల కలప డిపోలో టెక్నికల్ విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న లక్ష్మణ్‌తోపాటు వాచర్‌గా పనిచేస్తున్న రహీంను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా అటవీశాఖ అధికారి ఎం రవి ప్రసాద్ తెలిపారు.

# మూతపడ్డ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు



నగరంలో మూసి ఉన్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల

- ‘ఫీజు రీయింబర్స్‌మెంట్’ రాక అవస్థలు
- టోకన్స్ పడి నెలలు గడుస్తున్నా అందని డబ్బులు
- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా స్పందన కరువు
- నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్టు ముందే చెప్పినా పట్టించుకోని సర్కారు
- ఎస్‌యూ పరిధిలో 60 డిగ్రీ, 35 పీజీ కాలేజీలు బంద్
- దాదాపు 40 వేల మంది విద్యార్థులపై ప్రభావం
- భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తున్న యాజమాన్యాలు

తాము అధికారంలోకి వస్తే విద్యారంగానికి పెద్దపీట వేస్తామంటూ హామీనిచ్చిన కాంగ్రెస్, ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై నిర్లక్ష్యం చూపుతున్నది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యజమాన్యాల సంఘం నిరవధిక బంద్‌కు పిలుపునివ్వగా, విద్యాలయాలన్నీ సోమవారం నుంచి మూతపడ్డాయి. విద్యాసంవత్సరం మధ్యలో ఈ పరిణామాలు తలెత్తడంతో శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో దాదాపు 40వేల మంది డిగ్రీ, పీజీ విద్యార్థులపై ఈ ప్రభావం పడుతున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే కళాశాలలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న యాజమాన్యాలు, అలాగే బోధన, భోదనేతర సిబ్బందికి వేతనాలు అందక రోడ్డున పడే ప్రమాదమున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దృష్టి సారించి.. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలువాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ వస్తున్నది. ఇటు ఈ విషయంలో ఇప్పటికే విసిగివేసారిన యాజమాన్యాలు ప్రభుత్వంతో తాడేపేడో తేల్చుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి.




జగిత్యాల: కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

కరీంనగర్, అక్టోబర్ 14 (నమస్తేతెలంగాణ ప్రతినిధి)/ కమాన్‌చౌరస్తా : నిరుపేద విద్యార్థులకు సైతం ఉన్నత విద్యను అందించాలన్న లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో చేరుతున్నారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించిన విధానాన్ని స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కారు కూడా కొనసాగించింది. 2014లో అధికార పగ్గాలు చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఆనాటి నుంచి 2021 వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో చెల్లిస్తూ వచ్చింది. ఆ తర్వాత ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక దృష్టి సారించడం, వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం వంటి ప్రాధాన్యాల నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో 2021 నుంచి కొంత జాప్యం జరిగింది. నిజానికి కరోనా వంటి అత్యంత క్లిష్ట సమయంలోనూ ఆనాటి బీఆర్ఎస్ సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసి విద్యార్థులకు అండగా నిలిచింది. తెలంగాణ వచ్చిన తొలి రోజుల్లోనూ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా విద్యారంగంపై చిన్నచూపు చూడకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు చేసింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ గెలిచి అధికారంలోకి వస్తే, ఈసారి విద్య, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ ముందుగానే ప్రకటించారు. అయితే, ఎన్నికల్లో ఫలితాలు తారుమారు కావడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. నిజానికి ఎన్నికలకు ముందు విద్యారంగానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను చూస్తే కండ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి. విద్యారంగానికి సంబంధించి తన మేనిఫెస్టోలో 36కు పైగా హామీలు ఇచ్చింది. అందులో ప్రధానంగా ప్రతి విద్యార్థికి ₹5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని ప్రకటించింది. ప్రతి విద్యార్థికీ ఫ్రీ ఇంటర్నెట్ వైఫై సౌకర్యం కల్పిస్తామని చెప్పింది. ఇంకా మెరుగైన రీతిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రైవేట్ రంగంలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ప్రమాణాలు, నాణ్యతను పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఇలా ఉన్నత విద్యారంగానికి సంబంధించి దాదాపు 36 హామీలు ఇచ్చినా, ఆచరణలో మాత్రం చూపలేకపోయింది.

### విజ్ఞప్తి చేసినా స్పందన లేదు

ఈ విద్యా సంవత్సరంతో మొత్తం మూడు సంవత్సరాల ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రైవేట్ విద్యాలయాలకు రావాల్సి ఉందని యజమానులు చెబుతున్నారు. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ రాష్ట్ర అసోసియేషన్ పలుసార్లు కాంగ్రెస్ మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసింది. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చింది. మొత్తం పాత బకాయిలు ఒకేసారి చెల్లించలేకపోయినా ముందుగా ₹500 కోట్లు విడుదల చేస్తే.. తమ తమ కళాశాలలను ముందుకు నడుపుతామని విన్నవించింది. ఇచ్చే ₹500 కోట్లతో కళాశాలలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని, తద్వారా బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు ఇవ్వడానికి ఆస్కారం ఉంటుందని వాస్తవ పరిస్థితిని పలుసార్లు ప్రభుత్వ పెద్దల ముందు పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి క్షేత్రస్థాయి పరిస్థితిని తెలిపేందుకు రాష్ట్ర కమిటీ ప్రయత్నం చేసినప్పటికీ ప్రయత్నాలు ఫలించలేదు. ప్రభుత్వ పెద్దలతో చేసిన ప్రయత్నాలు విఫలం కావడం.. ఇదే సమయంలో కళాశాలలు నడుపడం భారంగా మారడంతో చాలా కళాశాలల్లో ఐదారు నెలలుగా బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు ఇవ్వని దుర్భర పరిస్థితి ఉన్నది. నిజానికి ఏటా అందుకోసం కేటాయించిన బడ్జెట్, ఆ మేరకు జిల్లాలకు, అక్కడి నుంచి ఆయా శాఖలకు కేటాయింపులు జరగడం వంటివి గతంలో జరిగాయి. సంబంధిత శాఖల ఆదేశాల మేరకు జిల్లా ట్రెజరీ అధికారులు ఆన్‌లైన్‌లో టోకన్ నంబర్లు జనరేట్ చేసి సంబంధిత కళాశాలలకు సమాచారం ఇచ్చారు. కానీ, చివరకు రాష్ట్ర ఆర్థిక శాఖ పేమెంట్లకు క్లియరెన్స్ ఇవ్వక పోవడంతో ఆన్‌లైన్‌లో టోకెన్లను తీసుకున్న నేటికీ ప్రయోజనం లేకుండా పోయింది. డబ్బుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నా, యజమాన్యాలకు నేటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు అందడం లేదు.

### 40వేల మంది విద్యార్థులపై ప్రభావం

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఆర్థికంగా చితికిపోతున్న కళాశాలల యాజమాన్యాలు, సోమవారం నుంచి నిరవధిక మూసివేతకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తమ డిమాండ్లు, విజ్ఞప్తులపై ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక మూసివేతకు వెళ్తామంటూ రాష్ట్ర, జిల్లాల నాయకత్వాలు పలుసార్లు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసినా సర్కారు పెడచెవిన పెట్టింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీకళాశాలలు సోమవారం నుంచి మూత పడ్డాయి. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తే తప్ప ఇప్పట్లో తెరుచుకునే అవకాశం లేదు. ఈ పరిణామాలు ఉమ్మడి జిల్లాలో సుమారు 40వేల మంది విద్యార్థులపై ప్రభావం చూపుతున్నాయి. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 65 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, 35 వరకు పీజీ కళాశాలలున్నాయి. వీటిలో 40 నుంచి 50వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో 95 శాతానికిపైగా విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చదువుతున్నారు. విద్యాసంవత్సరం సగంలో ఈ పరిస్థితులు తలెత్తడం వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం-యజమాన్యాల మధ్య నడుస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వివాదం.. తమ భవిష్యత్‌కు ప్రమాదకరంగా మారుతున్నదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం దిగి రాకపోతే.. తాడో పేడో తేల్చుకునేందుకు యాజమాన్యాలు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయి.

### రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు భవిష్యత్ కార్యాచరణ



తప్పని పరిస్థితుల్లో మూసివేతకు రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నది. మా ఉద్దేశం విద్యార్థులను ఇబ్బంది పెట్టాలన్నది కాదు. ప్రభుత్వం మాకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే ఆర్థికంగా కళాశాలలు నిలదొక్కుకుంటాయి. ఇప్పటికే తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేకపోతున్నాం. విద్యార్థులను అడిగే పరిస్థితి లేదు. మూడు నాలుగు నెలలు అంటే సర్దుబాటు చేసుకోవచ్చు. అలాగే బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు సర్దడానికి ఆస్కారం ఉంటుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితి మా చేతులు దాటిపోయింది. మెజార్టీ కళాశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఓనర్లు తాళం వేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదు. అద్దెలు కట్టే పరిస్థితి అంతకన్నా లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఒకేసారి కాకపోయిన దశల వారీగా ఇవ్వాలని కోరుతున్నాం. ఒక వేళ స్పందించకపోతే మాత్రం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు.. భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతాం. తమ ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకొని.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేస్తున్నాం.

**- వెంకటేశ్వర్‌రావు, శాతవాహన డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ప్రెసిడెంట్**

రేణికుంట టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు



## రెండో రోజూ బారులు

తిమ్మాపూర్, అక్టోబర్14: బతుకమ్మ, దసరా వేడుకలు ముగిశాయి. పండుగ కోసం పట్నం నుంచి ఊరిబాట పట్టిన ఉద్యోగులు, వ్యాపారస్తులు రెండ్రోజులుగా తిరుగుముఖం పడుతున్నారు. సెలవులు ముగించుకొని కార్లు, బస్సుల్లో తిరిగి జీవిత గమ్యానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలో రేణికుంట టోల్గేట్ వద్ద రెండో రోజు సోమవారం వాహనాలు భారీ స్థాయిలో బారులు తీరాయి. సాయంత్రానికి క్లియర్ అయ్యాయి.

## ఎల్ఎల్ఎం ఫలితాలు విడుదల

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 14 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టులో నిర్వహించిన పరీక్షల ఫలితాలు http://103.119.113.107:89, www.satavahana.ac.in చూడవచ్చని సూచించారు.

## 26 నుంచి ఓక్యూలో ప్లాస్టీ సేవలు

కరీంనగర్ విద్యానగర్, అక్టోబర్ 14 : రేకుర్తి కంటి దవాఖానలో ఈనెల 26 నుంచి ఓక్యూలో ప్లాస్టీ సేవలు ప్రారంభిస్తున్నట్లు దవాఖాన చైర్మన్, ట్రస్ట్ బోర్డు సభ్యులు కొండా వేణుమూర్తి తెలిపారు. సోమవారం దవాఖానలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంటి కాన్సర్‌కు సంబంధించి కనురెప్పలు, కన్నీటి వాహిక అడ్డంకులు, కక్ష్య పగులు, కళ్లచుట్టూ కణుతుల సమస్యలు ఉన్నవారు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిదుర సురేశ్, ప్రకాశ్‌హొల్లా, బొమ్మ పవన్‌కుమార్, కోల అన్నారెడ్డి, టీ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

# ఇదేం విచారణ?

- సిరిసిల్ల ట్రెజరీ కార్యాలయాలపై ‘నమస్తే’ వరుస కథనాలు
- వేములవాడ ఎస్టీవో కార్యాలయంలో ఏడీ విచారణ
- అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి ఆరా
- విచారణ రహస్యంగా చేస్తేనే కదా.. అవినీతి బయటకు వచ్చేదంటున్న బాధితులు



వేములవాడ సబ్ ట్రెజరీ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఏడీ నీరజ

రాజన్న సిరిసిల్ల జిల్లా ట్రెజరీ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే నీరజ చేస్తున్న విచారణపై విమర్శలు వస్తున్నాయి. ఓ ఉన్నతాధికారిగా విచారణ చేయడం అభినందనీయమే అయినా.. విచారణ సాగుతున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడ అవినీతి జరిగిందని కథనాలు వచ్చాయో.. అదే కార్యాలయానికి కొంత మందిని పిలిపించి, అందులోనూ అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి విచారణ చేసిన తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. ఉద్యోగులపై ఆరోపణలు వస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీ హెచ్చరించడం గమనార్హం.

కరీంనగర్ అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు వేములవాడలోని ట్రెజరీ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై ఇటీవల ‘నమస్తే తెలంగాణ’ వరుస కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. ఆయా కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి, పని పూర్తిచేయాలంటే టార్గెట్ పెట్టి వసూలు చేస్తున్న తీరు, లంచాలు తీసుకోవడానికి ఏసీబీకి చిక్కకుండా ఫోన్‌పే, గూగుల్‌పే వాడడం వంటి అనేక అంశాలను బహిర్గతం చేసిన విషయం విదితమే. ఈ కథనాలు సంచలనం రేపుతుండగా, ఇప్పటికీ చాలా మంది బాధితులు ‘నమస్తే’కు ఫోన్ చేస్తూ తమ బాధను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే నీరజ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మూడు రోజుల క్రితమే మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ మేరకు సోమవారం వేములవాడలోని ఎస్టీవో కార్యాలయానికి వచ్చి విచారణ జరిపారు. పెన్షన్ యూనియన్ ప్రెసిడెంట్‌తో పాటు మరికొంత మందిని ఇక్కడికే పిలిచి విచారణ సాగించారు. ఆ శాఖ ఉన్నతాధికారిగా సదరు శాఖపై వచ్చిన కథనాలపై స్పందించి, విచారణ చేయడం అభినందనీయమే అయినా.. విచారణ సాగిన తీరుపైనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా ఎస్టీవో కార్యాలయానికి కొంత మందిని పిలిచి, అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి వివరాలు ఆరా తీశారు. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో జరిగిన అక్రమాలు చెప్పడానికి ఎవరూ సాహసించరు. ఎందుకంటే ఒకవేళ వాస్తవాలు చెబితే సదరు సమాచారం తిరిగి అధికారులకు చేరి భవిష్యత్‌లో తనకు ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశంతో ఏ బాధితుడు కూడా ఇతరుల ముందు తనకు జరిగిన నష్టాన్ని, అన్యాయాన్ని, అధికారుల ద్వారా పడ్డ ఇబ్బందులను చెప్పడానికి ఇష్టపడడు. అందులోనూ అదే కార్యాలయంలో విచారణ జరపడం వల్ల ఇతర ప్రాంతాల్లో ఉన్న బాధితులు తమ బాధలు చెప్పుకొందామని ఉన్నా ఆ కార్యాలయం దరిదాపుల్లోకి రారు. ఎందుకంటే విచారణకు ఎవరూ వచ్చారన్న విషయం వెంటనే సదరు అధికారులకు తెలిసిపోతుందని.

### అవినీతి బయటకు రావాలంటే..

నిజానికి అవినీతి బయటకు రావాలంటే.. విచారణ అధికారులు ఎలా ముందుకు వెళ్లాలన్న అంశాలను ‘నమస్తే తెలంగాణ’ కథనాల్లోనే ప్రచురించింది. మార్చి నుంచి రిటైర్‌మెంట్ అయి.. పింఛన్ కోసం ట్రెజరీ కార్యాలయాలకు వచ్చిన జాబితాలను తీసుకొని, వారి నుంచి వివరాలు సేకరిస్తే జరిగిన అన్యాయంతోపాటు సమర్పించుకున్న ముడుపుల వివరాలను చెప్పడానికి ఆస్కారం ఉంటుందని, విచారణ కూడా పారదర్శకంగా జరిగేలా చూసినప్పుడే బాధితులు ముందుకొస్తారని కథనాల్లో స్పష్టంగా ఉన్నది. నిఘా విభాగాల అధికారులు ఈ క్రమంలోనే తమ తమ విచారణ సాగిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ కూడా ఇదే తరహాలో ముందుకెళ్తే చాలా మేరకు సమాచారం వచ్చేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, సోమవారం విచారణకు వస్తున్నట్టు కార్యాలయానికి పిలిచిన వారికి తప్ప.. మిగిలినవారికి సమాచారం లేదని తెలుస్తున్నది. మార్చి నుంచి రిటైర్‌మెంట్ అయిన వారితోపాటు ఇటీవల వేములవాడ ఎస్టీవో కార్యాలయం ద్వారా జరిగిన లావాదేవీలతో సంబంధం ఉన్న వ్యక్తులకు ఫలానా తేదీ రోజు విచారణ ఉంటుందని ఒక సంక్షిప్త మెసేజ్ పంపిస్తే.. అందరికీ సమాచారం తెలిసేందుకు అవకాశం ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ అనేది రహస్యంగా జరగాలే తప్ప.. అందరినీ ఒకే చోటకు చేర్చడం వల్ల అసలు బాగోతం బయటకు ఎలా వస్తుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### కఠిన చర్యలు తీసుకుంటాం : ఏడీ నీరజ హెచ్చరిక

అవినీతి ఆరోపణలు వస్తే శాఖా పరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఏడీ హెచ్చరించారు. సోమవారం విచారణ జరిపిన అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సిటిజన్ ఛార్ట్ ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించిన ఏడీ గ్రామ పంచాయతీ చెక్కులు, డీఏ బిల్లులు, పెన్షన్లు, ఇతర బిల్లులను ఆలస్యం చేయకుండా పాస్ చేసి, ఈ కుబేర్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆఫీస్ కార్యాలయ రికార్డులను తనిఖీ చేసినట్టు తెలిపారు.



# దసరా కిక్కు.. ₹59.46 కోట్లు

## ఉమ్మడి జిల్లాలో మద్యం తెగ తాగేసిన్రు

- పండుగ పూట మద్యం ఏరులు
- వైన్స్‌లతోపాటు బెల్టుషాపుల్లో జోరుగా విక్రయాలు
- సర్కారుకు భారీగా ఆదాయం
- గతేడాదితో పోలిస్తే ₹30 కోట్లు అదనం

ఉమ్మడి జిల్లాకు దసరా కిక్కెక్కింది. మద్యం ప్రవాహం కట్టలు తెంచుకున్నది. పండుగ సందర్భంగా విక్రయాలు జోరందుకొని ఏరులై పారింది. వైన్స్ షాపులతోపాటు ఊరూవాడా ‘బెల్టులై’ పారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మందుబాబులను ‘ఫుల్లు’గా తాగించి, వారి జేబులను ఖాళీ చేయించి సర్కారు భారీ ఆదాయాన్నే మూటగట్టుకున్నది. నాలుగురోజుల్లోనే రికార్డు స్థాయిలో ₹59.46 కోట్లు సమకూర్చుకున్నది.

కరీంనగర్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. దసరా పండుగకు తెగ కిక్కించాయి. ఒకప్పుడు రెవెన్యూ విభాగంలో ఓ భాగంగా ఉన్న ఎక్సైజ్ శాఖ, ఇప్పుడు ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిందనేందుకు పెరుగుతున్న విక్రయాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. మొత్తం 290 మద్యం దుకాణాలు, 63 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా, ప్రధానంగా జిల్లాకేంద్రాలతోపాటు గోదావరిఖని, మంథని, హుజూరాబాద్, కోరుట్ల, వేములవాడ ప్రాంతాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. వీటికితోడు బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులైపారగా, భారీ ఆదాయమే లక్ష్యంగా ఎక్సైజ్ అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ విక్రయాలు జరిగేలా చూసినట్టు తెలుస్తున్నది.

**నాలుగు రోజుల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మద్యం అమ్మకాలు**

| జిల్లా | గతేడాది ఆదాయం (రూ.కోట్లలో) | ఈ ఏడాది ఆదాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| పెద్దపల్లి | 9.98 | 12.58 |
| కరీంనగర్ | 13.79 | 33.52 |
| సిరిసిల్ల | 4.82 | 5.14 |
| జగిత్యాల | 2.52 | 8.22 |
| మొత్తం | 29.11 | 59.46 |

మొత్తంగా దసరా పండుగ సందర్భంగా నాలుగు రోజుల్లోనే ₹59.46కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్ జిల్లాలో గతేడాది దసరా సందర్భంగా నాలుగు రోజుల్లో 17,274 లిక్కర్ల కాటన్లు, 60,655 బీర్లు కాటన్ల విక్రయం ద్వారా ₹22.97 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం నాలుగు రోజుల్లోనే 28,363 లిక్కర్ కాటన్లు, 67,595 బీర్ల కాటన్ల విక్రయం ద్వారా ₹33.52 కోట్ల ఆదాయం వచ్చింది. పెద్దపల్లి జిల్లాలో గతేడాది 9,283 లిక్కర్ కాటన్లు, 16,113 బీరు కాటన్లు అమ్మగా ₹9.98కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం 12,343 లిక్కర్ కాటన్లు, 22,414 బీర్ల కాటన్ల విక్రయాలతో ₹12.58 కోట్లు వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతేడాది 4,072 కాటన్ల లిక్కర్, 9,940 కాటన్లు బీర్ల విక్రయంతో ₹4.82కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. ప్రస్తుతం 4,286 కాటన్ల లిక్కర్, 10,636 కాటన్ల బీర్లు విక్రయించడంతో ₹5.14కోట్ల ఆదాయం వచ్చింది. జగిత్యాల జిల్లాలో గతేడాది 1,687కాటన్ల లిక్కర్, 7,076 కాటన్లు బీర్లు అమ్మగా ₹2.52కోట్ల ఆదాయం చేకూరింది. ప్రస్తుతం 6,618 కాటన్ల లిక్కర్, 19,114 కాటన్లు బీర్లు విక్రయించడంతో ₹8.22కోట్ల ప్రాఫిట్ చేకూరింది. మొత్తంగా గతేడాదితో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో ₹30.35 కోట్ల ఆదాయం పెరిగిందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

### అమ్మకాలు పెరిగాయి

జిల్లాలో చాలా వరకు గుడుంబాను నియంత్రణలోకి తెచ్చాం. ఈ క్రమంలో మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వానికి అత్యధికంగా ఆదాయం సమకూరుతున్నది. గతేడాదితో పోలిస్తే మద్యం అమ్మకాలు బాగా పెరిగాయి.

**- మహిపాల్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి(పెద్దపల్లి)**